ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 5 జనవరి 2025

బతుకుదెరువుకు ఇదే ఆధారం



దసలిపట్టు చిక్కు తీస్తున్న కార్మికుడు



పట్టువస్త్రం నేస్తున్న కార్మికుడు

- దసలీపట్టు.. వారికి జీవనోపాధి
- అష్టకష్టాలైనా అనాదిగా అదే పని
- తాతలకాలం నుంచి మారని తలరాతలు
- పట్టించుకోని ప్రభుత్వాలు

మహదేవపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దసలి పట్టు.. వారికి జీవనోధారం. తరతరాలుగా ఉపాధికి ఎంచుకున్న ఏకైక మార్గం. ప్రకృతితో మమేకమైన బతుకుదెరువు అది. లాభనష్టాలను బేరీజు వేసుకోకుండానే ఈ పరిశ్రమనే నమ్ముకొని కాలం వెళ్లదీస్తున్నారు వారు. మహదేవపూర్ అటవీ ప్రాంతంలో దసలి పురుగులు పెంచడం, టస్సర్ కాలనీలో పట్టు వస్త్రాలను నేయడమే వారి పని. తాతాముత్తాతల కాలం నుంచి ఇదే జీవనాధారమైనా వారి తలరాతలు మాత్రం మారలేదు. ఖరీదైన వస్త్రాలు తయారు చేసే ఈ కార్మికులకు జీవితాలు అనాదిగా దుర్భరంగానే సాగుతున్నాయి.

పట్టు పరిశ్రమ ప్రసిద్ధి మహదేవపూర్. ఇక్కడ అనేక కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం ద్వారా దసలి గడ్లు మాత్రమే సరఫరా అవుతాయి. పట్టు పురుగులు బయటకు రాగానే అటవీ ప్రాంతంలోని మద్ది చెట్లపై వారు విడిచిపెడుతారు. మేత కాలంలో చీమలు, కీటకాలు, పక్షులు, కోతులు, విష పురుగుల నుంచి వాటిని రక్షించుకుంటారు. ఈ క్రమంలో పట్టు పురుగులు ఆ చెట్లపై గూళ్లను ఏర్పరచుకుంటాయి. పురుగులను నిర్జీవం చేసి కార్మికులు వాటి ద్వారా పట్టు దారం తీస్తారు. దీంతో మగ్గంపై వస్త్రాలు నేస్తారు. విభిన్న రంగులను అద్ది ఆకర్షణీయంగా తయారు చేస్తారు.

పట్టు వస్త్రాలకు మహా క్రేజ్

మహదేవపూర్ దసలి పట్టు వస్త్రాలు అంటేనే ఓ ప్రత్యేక ఉంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, పూజా క్రతువులకు, దేవతామూర్తులకు సమర్పించేందుకు ఈ వస్త్రాలను వినియోగిస్తారు. ఈ రంగంలో ఇప్పటికే చాలా మంది ఉండగా నేటి తరం యువత కూడా మక్కువ చూపుతున్నారు. కష్టం ఎక్కువ ఉండి, లాభం తక్కువఉన్నా మరో ఉపాధి లేక ఈ పరిశ్రమనే నమ్ముకుంటున్నారు.

ప్రభుత్వ సహకారం లేక..

మహదేవపూర్‌లో అటవీ ప్రాంతంలో పట్టు పురుగుల పెంపకంలో సుమారు 190 కుటుంబాలు ఆధారపడ్డాయి. దసలి పట్టు వస్త్రాల తయారీలో టస్సర్‌కాలనీలో 84 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. పట్టు పురుగుల పంపెకంలో సుమారు 30 మంది. దసలి పట్టు వస్త్రాల తయారీలో 20 మంది వరకు పని చేస్తున్నారు. వీరికి ప్రభుత్వ పరంగా రాయితీ, ప్రోత్సాహకం, చేయూత అందిండంలేదు. అటవీ ప్రాంతంలో రాత్రీ పగలూ విషపు కీటకాలు, పురుగులు, పాములతో కుస్తీపడుతున్నా, ప్రాణాలకు సైతం హానీ జరిగే అవకాశాలు ఉన్నా స్పందన కరువైంది. ప్రభుత్వాలు వీరిని పట్టించుకోవడం లేదు.



బీమా సౌకర్యం కల్పించాలి: బిల్లా భాస్కర్, దసలి పట్టు పురుగు పెంపకందారుడు

అటవీ ప్రాంతంలో చలి, వర్షంలో రాత్రి, పగలు అని తేడా లేకుండా పట్టు పురుగులను కాపాడుతూ అడవిలోనే ఉంటున్నాం. పట్టు పురుగుల పంటలు రావాలంటే కత్తిమీద సాము లాంటింది. అడవిలో జంతువులు, విష పురుగులు, కీటకాలతో ప్రమాదాలు జరిగినప్పుడు బీమా సౌకర్యం, మెరుగైన వైద్య సదుపాయాలు అందించేలా ప్రభుత్వం చొరవచూపాలి.



కొత్త యంత్రాలు అందించాలి : రెబ్బ సతీష్, పట్టు వస్త్ర కార్మికుడు

దసలి పట్టు వస్త్రాల కోసం మగ్గం నేయడం చాలా ఇబ్బంది, కష్టతరమవుతోంది. సాంకేతికంగా ఈ పరిశ్రమను ప్రభుత్వం అభివృద్ధి చేసి కొత్త యంత్రాలు అందించి మాలాంటి వారికి ఉపాధిని మెరుగుపర్చాలి.

ములుగు మునిసిపాలిటీకి కేబినెట్ ఆమోదం

- పాత బిల్లును సవరిస్తూ జాకారం విలీనం
- నాలుగు గ్రామ పంచాయతీలతో విస్తరణ



వివరాలు 7వ పేజీలో

రారండి.. ముగ్గులు వేయగ..

నేడు 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

భూపాలపల్లి, ములుగు జిల్లా కేంద్రాల్లో నిర్వహణ

భూపాలపల్లి వేదిక : అంబేద్కర్ స్టేడియం, భూపాలపల్లి

ములుగు వేదిక : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, ములుగు

సమయం : ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రతి సంవత్సరంలాగే ఈఏడాది కూడా అంధ్రజ్యోతి-ఏబీఎన్ సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. అంధ్రజ్యోతి- ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పోటీలు జరుగనున్నాయి.

అలాగే ములుగు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కూడా ఆదివారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ఆయా జిల్లా స్థాయిలో మొదటి విజేతలుగా నిలిచిన వారికి రూ.6వేలు, ద్వితీయ విజేతలకు రూ.4వేలు, తృతీయ విజేతలుగా నిలిచిన వారికి రూ.3వేలు బహుమతిగా అందించనున్నారు. ఇక పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.

నిబంధనలివీ..

మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, తదితర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్నివరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. గొట్టాలు, బద్దలు, ఇతర పరికరాలు ఏమీ ఉపయోగించకుండా కేవలం చేతితోనే ముగ్గు వేయాల్సి ఉంటుంది. ఇక ముగ్గు అందంగా కనపడేందుకు సంప్రదాయరీతిలో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు.



వైభవంగా లక్ష తులసీ దళాల పూజ



లక్ష తులసిపూజలో ఉత్సవమూర్తులు

మహదేవపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్రపుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం తులసీ దళ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామాచారి, నగేష్ శర్మ, కృష్ణ మూర్తిశర్మ, వేద పండితులు పాండే సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేద మంత్రాలు, బాజా బజంత్రీలు మంగళవాయిద్యాల నడుమ తులసి ధళం పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవో మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్‌తో హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు, మాసోత్సవాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా కార్యక్రమాలను రూపొందించాలన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో మండల, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలో రహదారి భద్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కంటే రహదారుల ప్రమాదాల్లోనే అధిక సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషిచేయాలన్నారు. రహదారి భద్రత నిబంధనలు పాటించని వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అవసరమైతే భవిష్యత్తులో లైసెన్స్‌ను రద్దు చేసే విధంగా సాఫ్ట్‌వేర్ రూపొందించనున్నట్లు తెలిపారు. హెల్మెట్ వినియోగంపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. హాస్టళ్లకు నిత్యావసర సరుకులను సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లుల జాప్యం లేకుండా త్వరగా చెల్లిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో సమ్మాసీ, డీఎంహెచ్‌వో మధుసూదన్ పాల్గొన్నారు. ములుగు నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.



చిట్యాల కేజీబీవీలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

వైద్య రంగానికి పెద్ద పీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కలెక్టరేట్‌తో కలిసి విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

చిట్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వైద్యా రంగానికి కూడా అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. మండలంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం ప్రారంబానికి ముందగానే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తరగతి గదులు, విద్యుత్, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీతో పాటు వేడి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 40 శాతం డైట్, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచడంతో పాటు అన్ని వసతి గృహాల్లో కామన్‌మెనూతో నాణ్యమైన భోజనాలు అందిసున్నామని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో వేడినీటి సౌకర్యం కోసం గీజర్లు, తాగునీటికి ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు నిరంతరం వసతి గృహాలను తనిఖీ చేయాలని. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎంఈవో రఘుపతి, ఎంపీడీవో జయశ్రీ,

మిగతా 8వ పేజీలో...

నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మురళీనాయక్

కేసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులందరికీ ఇల్లు వస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. కేసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఇందిరమ్మ పథకంలో నమూనా ఇల్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిపేదవారికి రూ.5లక్షల్లోనే ఇల్లు నిర్మాణం పూర్తయ్యే విధంగా నమూనా ఇల్లును 45 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎంపీడీవో క్రాంతి, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, అయూబ్‌ఖాన్, గ్రామపార్టీ అధ్యక్షుడు పొలెపల్లి వెంకట్ రెడ్డి, తాజొద్దిన్‌ఖాన్, వేముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బేరువాడలో బీఆర్‌ఎస్ బీసీసెల్ మండల కార్యదర్శి ముదిగిరి చిన్నసాంబయ్యతో పాటు మరికొంతమంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఏజెన్సీలో వైద్య సేవలను మెరుగు పరుస్తాం

గూడూరు (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీలో వైద్య సేవలను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఎర్రకుంటతండాలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కేటాయించిన భూమిని శనివారం స్థల పరిశీలన చేశారు. మచ్చర్లలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గూడూరులో 108, 102 అంబులెన్స్‌లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ గూడూరు ఏజెన్సీ మండలంలో విద్యా, వైద్యం, రహదారుల నిర్మాణానికి అధికశాతం నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, కాంగ్రెస్ జిల్లా నాయకులు రమేష్‌చందర్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కొమ్మాలు, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, శ్రీపాల్ రెడ్డి, బొల్లికొండ మధు, అర్రెం వీరస్వామి,జిల్లా మేనేజర్ మహేష్, సిబ్బంది బుచ్చయ్య, హన్మంతు, శ్రీను, లలిత, అనిల్, ప్రశాంత్, శ్రీకాంత్, లెనిన్, రాజ్‌కుమార్, నాగరాజు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కోర్టుకు నూతన భవనం

» రూ.81కోట్లను మంజూరు చేసిన ప్రభుత్వం » ఒకే ప్రాంగణంలో 12 కోర్టులు » నెలాఖరులో టెండర్లు

ములుగు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కోర్టుకు నూతన భవనం మంజూరైంది. ఇందుకు రూ.81కోట్లను మంజూరుచేస్తూ గత నెలలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే స్థల సేకరణ పూర్తికాగా ఈనెలాఖరులో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు మొదలుపెట్టేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏడేళ్లుగా ములుగు కోర్టు అద్దె భవనంలో కొనసాగుతోంది. గతంలో బండారుపల్లి రోడ్డులో ఉన్న సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బహుళ అంతస్థుల భవనంలో కోర్టును ఏర్పాటు చేశారు. ములుగు జిల్లాగా ఏర్పాటైన తర్వాత జిల్లా కోర్టుకు అనుబంధంగా పలు కోర్టులు మంజూరయ్యాయి. క్రమం తప్పకుండా జాతీయ లోక్ అదాలత్‌లు కూడా జరుగుతున్నాయి. దీంతో ఇరుకు గదులలో అందరూ అసౌకర్యానికి గురవుతున్నారు. ఈనేపథ్యంలో మంచిర్యాల, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, వికారాబాద్ జిల్లాలతోపాటు ములుగు జిల్లాకు సకల సదుపాయాలతో భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. మొత్తం రూ.81కోట్ల నిధులలో 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉంది. ఫ్యామిలీ, పోక్సో కోర్టు కలిపి మొత్తం 12కోర్టులు ఒకే భవనంలో ఏర్పాటు చేయనున్నారు.

గట్టమ్మ పరిసరాల్లో స్థలం

గట్టమ్మ దేవాలయం సమీపంలో పదెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పటికే కోర్టు కోసం కేటాయించారు. సర్వే పూర్తిచేసిన అధికారులు హద్దులు కూడా నిర్ణయించారు. ఆపక్కనే జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం జరుగుతోంది. మరోవైపున ఉన్న స్థలాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించింది. జిల్లా పాలనలో అతిముఖ్యమైన అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్, న్యాయస్థానాలు ఒకేచోట ఏర్పాటవుతుండటం గమనార్హం.



నూతన కోర్టు భవన సముదాయం నమూనా

ఆర్అండ్‌బీ సీఈని కలిసిన బార్ అసోసియేషన్

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డిని ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కన్నెబోయిన సునిల్‌కుమార్ శనివారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోర్టు భవన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఈ జనవరి చివరిలోగా టెండర్లు పిలుస్తామని చెప్పారు. కాగా, భవనానికి సంబంధించిన నమూనాను ఆర్అండ్‌బీ అధికారులు విడుదల చేశారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల మోడల్ వసతిగృహంలో ఆయన బాలికలకు దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యా రంగానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నా రన్నారు. హాస్టళ్లలో చదువుకునే విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. స్వచ్ఛమైన నీటి కోసం ఆర్‌వోటీలు, వేడి నీటికోసం గ్రీజర్లతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. నూతన మెనూతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు.

మోడల్ స్కూల్, కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూ.26 లక్షలతో పోతుగల్లు నుంచి కొరికిశాల, పెద్దకో మటి పల్లి నుంచి కొరికిశాల వరకు బీటీరోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి శైలజ, మండల స్పెషలా ఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీ డీవో హుస్సేన్, చిట్యాల ఏఎంసీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, పీఏ సీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ. రఫీ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాకేష్, కేజీబీవీ స్పెషలా ఫీసర్ శైలజ, మోడల్‌స్కూల్ కేర్‌టేకర్ రజిత, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తక్కళ్లపల్లి రాజు, నడిగోటి రాము, కుమారస్వామి, సుదర్శన్, వెంకటేశ్వరరెడ్డి, బక్కిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

గణపురం (ఆంధ్రజ్యోతి): వి ద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు కాంక్షించారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ హాస్టల్ వద్ద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా పనిచేయాలి

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పూర్వ ప్రాథమిక విద్యా పరికరాలు, అంగన్‌వాడీ ప్రీ స్కూలు పిల్లలకు యూనిఫారాలను స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని సదినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రెండు అంగన్‌వాడీ ప్రాజెక్టులకు 394 ర్యాక్స్, 334 రౌండ్ టేబుల్స్, 334 రెక్టాంగిల్ టేబేల్స్, 408 మ్యాపులు పంపిణీ చేశారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

లూయిస్ బ్రెయిల్ జయంతి వేడుకలను ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. లూయిస్ చిత్రపటానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్

ఉత్తమ బాల్యాన్ని అందించాలి

సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్

ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఉత్తమ బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి సమావేశ మందిరంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్-11 సమన్వయ సమావేశం నిర్వ హించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ బాల్యం ఎంతో అమూల్యమైనదని, మనిషి భవిష్యత్‌ను నిర్ణయించేది బాల్యమేనని అన్నారు. మైనర్లను పనిలో పెట్టుకునేవారిని ఉపేక్షించవద్దన్నారు. 14ఏళ్లలోపు పిల్లలు తప్పకుండా బడిలో ఉండాలని, ఇటుక బట్టీలు, భవన నిర్మాణరంగం, మిర్చి తోటల్లో ఎవరైనా బాల కార్మికులు ఉన్నట్లయితే వారిని గుర్తించి తిరిగి చదువుకునేలా చూడాలని అన్నారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో చాటింపు కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, బాల కార్మికులు, మైనర్లు భాగస్వామ్యం అయ్యే విధంగా వివిధ వర్గాల ప్రతినిధులతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు.

ఆపరేషన్ స్మైల్‌లో భాగస్వాములైన సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏజేఎఫ్‌సీఎం జడ్జి సౌఖ్య, బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ, ఏఎల్ వో వినోద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, జేజేబీ సభ్యులు సుభాష్, డీపీవో రమణమూర్తి, ఎస్సైలు సురేష్, ఇమ్మాన్యుయేల్, మౌనిక, డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్లు కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, సిబ్బంది జ్యోతి, సుమన్, రాజు, నరేష్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తిని కొనసాగించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తిని కొనసాగించాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం చెర్లపాలెంకు చెందిన ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చెర్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడేళ్లుగా పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. అనంతరం తొర్రూరులోని స్నేహ నివాస్‌లో అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వారికి అన్నదానం ఏర్పాటు చేశారు.

రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తూనం శ్రావణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుకై ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు రూ.లక్ష చెక్కును డీఎం పద్మావతికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, రాజా రామ్మోహన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలున్నా.. స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పించాలి

నెల్లికుదురులో ఫ్లెక్సీ కట్టిన బాలాజీనాయక్

నెల్లికుదురు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు పిల్లలు ఉంటే.. వచ్చే స్థానిక సంస్థల్లో పోటీకి అర్హత కల్పించాలని కోరుతూ కాస్య తండాకు చెందిన బానోత్ బాలాజీనాయక్ నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్‌లో శనివారం ఫ్లెక్సీ కట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు పిల్లలు ఉంటే చాలామంది ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నారని, ప్రజాప్రతినిధులు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరాడు.



నెల్లికుదురులో కట్టిన ఫ్లెక్సీ

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థినుల ఎంపిక

కాటారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి శనివారం తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థినులు జి.మేఘన, జె.రమ్య ప్రతిభను కనబర్చారని పేర్కొన్నారు. మేఘన ప్రథమ, రమ్య తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థినులకు సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రాంనాథ్, సభ్యులు రాజమల్లయ్య, దేవానాయక్ తదితరులు బహుమతులు అందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సోషల్ టీచర్ విజయలక్ష్మి, గౌతమి తదితరులు అభినందించారు.



మేఘన



రమ్య

'చిన్న కాళేశ్వరం' పనులను అడ్డుకున్న గ్రామస్థులు

మహదేవపూర్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మెయిన్ కెనాల్ పనులను ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన పలువురు రైతులు శనివారం అడ్డుకున్నారు. మండలంలోని ఎల్కేశ్వరం శివారు చెందిన సర్వే నంబర్లు 167, 169లోని భూమితో పాటు వేరే సర్వే నంబర్లలోని మరికొంత భూమి నిర్మాణ సంస్థ సేకరించింది. దీనికి పరిహారం అందించకుండానే పనులు చేపట్టడంపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితమే యంత్రాలతో పనులను ప్రారంభించేందుకు రాగా అడ్డుకున్నామని తెలిపారు. మళ్లీ శనివారం యంత్రాలతో వచ్చి పోలీసు బందోబస్తు నడుమ పనులు ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వకుండా ఇలా పనులు చేపడితే ఎలా? ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయంపై మూడు రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసు

మంత్రి శ్రీధర్‌బాబును ఆదివారం కలిసి తమ సమస్యపై వివరి స్తామని రైతులు చెప్పారు. ఇదిలా ఉండగా కెనాల్ పనులు త్వరగా ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఇక్కడి అధికారులపై ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు పనులను ప్రారంభించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమకు పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పరిహారం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినుల పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన!

» హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో వెకిలి చేష్టలు
» ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వకుండానే తీసుకెళ్లిన పీఈటీ
» ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మహాముత్తారం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల ఓ పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించాడు. హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీలకు అధికారులు గానీ, ప్రిన్సిపాల్‌కు గానీ సమాచారం ఇవ్వకుండా విద్యార్థి నులను తీసుకెళ్లి వారిపట్ల వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి విద్యార్థినుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని దొబ్బలపాడు మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ క్రమంలో డిసెంబరు 26న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఆ విద్యార్థినులను వారి పాఠశాలకు చెందిన కాంట్రాక్ట్ పీఈటీ తీసుకెళ్లాడు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ భూక్యా రవి సెలవులో ఉన్నారు. వైస్ ప్రిన్సిపాల్ షరీఫ్ విధులు నిర్తిస్తున్నారు. అయితే.. ఎలాంటి ప్రొసీడింగ్స్ లేకుండా, ప్రిన్సిపాల్‌కు గానీ, విధుల్లో ఉన్న వైస్ ప్రిన్సిపాల్‌కు గానీ సమాచారం ఇవ్వకుండానే విద్యార్థినులను పీఈటీ హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఈ విషయం మరుసటి రోజు విద్యార్థినుల తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ప్రిన్సిపాల్ రవి.. పీఈటీని ఫోన్‌లో నిలదీశారు. అలాగే జిల్లా అధికారులకు ఫోన్ చేసి ప్రొసీడింగ్స్ లేకుండా, తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. అయినా సంతృప్తికరమైన సమాధానం రాలేదు. విద్యార్థినులను క్రీడల కోసం బయటకు తీసుకు వెళ్లాలంటే నిబంధనలకు మేరకు జిల్లా క్రీడల శాఖ నుంచి పాఠశాలకు ప్రొసీడింగ్స్ పంపాలి. విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి అంగీకారపత్రం తీసుకోవాలి. అయితే.. పీఈటీ ఇవేవీ లేకుండానే తన సొంత నిర్ణయంతో విద్యార్థినుల తీసుకెళ్లాడని తెలియడంతో మోడల్ స్కూల్స్ రాష్ట్ర అడిషినల్ డైరెక్టర్ శ్రీనివాసాచారికి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఏడీ ప్రిన్సిపాల్ రవికి ఫోన్ చేసి ఆరా తీశారు. విద్యార్థినుల విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదని తెలుసుకున్నారు. ఇదే క్రమంలో రెండు రోజులు తర్వాత క్రీడలు ముగిశాక డిసెంబరు 29న విద్యార్థినులను పీఈటీ హైదరాబాద్ బస్సు ఎక్కించి అక్కడే ఉండిపోయాడు. విద్యార్థినులు ఇక్కడికి చేరుకోగానే ప్రిన్సిపాల్ వారిని సంప్రదించగా విస్తుబోయే విషయం వెల్లడైంది.

క్యాంపులో ఉన్న సమయంలో పీఈటీ మద్యం తాగి తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, తరచూ దుర్భాషలాడే వాడని విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు తెలిపారు. అంతేకాకుండా అతనిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రిన్సిపాల్ రవిని వివరణ కోరగా పీఈటీ తమకు సమాచారమివ్వకుండానే సొంత నిర్ణ యంతో విద్యార్థినులను హైదరాబాద్‌కు తీసుకెళ్లాడని తెలి పారు. అక్కడ మద్యం తాగి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని విద్యార్థినులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ విషయంలో పీఈటీకి ఇప్పటికే షోకాజ్ నోటీసు ఇచ్చామని, కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆయ న్ను నియమించుకున్న ఏజెన్సీకి ఫిర్యాదు చేశామని వివరించారు. అదే విధంగా మోడల్ స్కూల్ ఏడీతోపాటు ఏఎంవో, డీఈవోకు నివేదిక పంపించామని తెలిపారు. గతంలో కూడా ఈ పీఈటీపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు.

పాట కట్టి.. పదం కదిపి..


కళాకారుడు దేశెట్టి ప్రవీణ్‌కుమార్

- సమాజం కోసం గళం విప్పుతున్న ప్రవీణ్
- చిన్నతనం నుంచే నాటకాలు, పాటలతో ప్రయాణం
- రాష్ట్ర సాంస్కృతిక సారథి సభ్యుడిగా రాణిస్తున్న యువకుడు

యువ

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడికి పాటంటే ప్రాణం.. చిన్ననాటి నుంచే పాటల పట్ల మక్కువ. కాలుకు గజ్జె కట్టి పాటలు పాడుతూ.. వీధి నాటకాలు వేస్తూ కళాకారుడిగా గుర్తింపు పొందాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో గోసి కట్టి.. కాలుకు గజ్జె కట్టి...భుజంపై గొంగడి వేసుకుని ఊరూరా తిరిగి ప్రదర్శనలిచ్చి ప్రజలను చైతన్యవంతం చేసిన యువకెరటం. తనదైన శైలిలో ముందుకు సాగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ.. కళాకారుడిగా గుర్తింపు పొంది.. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడిగా ఎంపికై అందులో రాణిస్తున్నాడు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అతడే మహబూబాబాద్ మండలం కొత్తరెడ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి రామచంద్రయ్య-దనమ్మల కుమారుడు ప్రవీణ్ కుమ్యార్. ప్రస్తుతం తన కలం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేకంగా పాటలు రాస్తూ గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. తాజాగా ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా పాటను రాసి ఆలపించి అందరి మనసులను గెలుచుకున్నాడు.

చిరుప్రాయం నుంచే కాలుకు గజ్జె కట్టి ..

ప్రవీణ్‌కుమార్‌కు చిరుప్రాయం నుంచే పాటంటే ప్రాణం. పోరాటాల గడ్డ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటివద్ద ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివి.. అక్కడ కమ్యూనిస్టు పాటలకు ఆకర్షితుడయ్యాడు. చిన్నతనం నుంచే పాటలు పాడుతూ వీధినాటకాలు వేస్తూ పాఠశాల స్థాయిలోనే ప్రసంశలు, మన్ననలు పొందాడు. ఏడో తరగతి చదువుతున్న సమయంలో 1997 సంవత్సరంలో సామాజిక చైతన్య గీతాల పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రథమ బహుమతిని సాధించి అప్పటి కలెక్టర్ నీరాబ్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నాడు. ఆ తర్వాత మహబూబాబాద్‌లో 9 నుంచి డిగ్రీ వరకు చదివి.. కళాశాల స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని సామాజిక, అభ్యుదయ గీతాలు ఆలపించి బహుతులు దక్కించుకున్నాడు.

కళాకారుడిగా రాణింపు..

తెలంగాణ ఉద్యమంలో తాను సైతం అంటూ ప్రవీణ్‌కుమార్ తన పాటల ద్వారా ప్రజలను ఉత్తేజ పర్చడమే కాకుండా పోరాటాల వైపు నడిపించారు. పూర్వ మహబూబాబాద్ డివిజన్ ప్రాంతంలో ప్రతీ పల్లె, తండాల్లో ధూంధాంలు నిర్వహిస్తూ కళాకారుల బృందంలో ప్రవీణ్‌కుమార్ కూడా తన గానం ద్వారా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తన పాటల ద్వారా ప్రజలకు చేరవేశాడు. మంచి కళాకారుడిగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథి బృందం సభ్యుడిగా నియమించింది. అప్పటి నుంచి మహబూబాబాద్ నియోజకవర్గ సాంస్కృతిక సారథి బృందంలో పని చేస్తూ నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గుర్చి పాటల రూపంలో వివరిస్తూ ప్రజలు, అధికారుల మన్ననలు పొందుతూ రాణిస్తున్నారు.

పాటలు పాడటమే కాకుండా దరువు వేయడంలో కూడ దిట్ట. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తన కలం ద్వారా సొంతంగా కొన్ని పాటలు రాసి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడుతూ గుర్తింపు పొందుతున్నాడు. తాజాగా కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గాన కోకిల అవార్డును అందుకున్నాడు.


ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి సత్కారం పొందుతున్న ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



హుస్నాబాద్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గానకోకిల అవార్డును అందుకుంటున్న ప్రవీణ్ (ఫైల్)

ఐదు దశాబ్దాల అక్షర సౌరభం

- రచనలు, కవితలతో ప్రశంసలందుకున్న అనిశెట్టి రజిత
- కవయిత్రిగా, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు

సాహితి శిఖరం


ప్రజాకవి కాళోజీతో అనిశెట్టి రజిత (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆమెది ఐదు దశాబ్దాల అక్షర ప్రయాణం. తన రచనలు, కవితలతో పా టు సాహిత్య రంగంతో అపూర్వ అనుబంధాన్ని ఏర్పాటు చేసుకు న్నారు. తన అర్ధ శతాబ్దపు ప్రయాణంలో దాశరథి, కాళోజీ, డాక్టర్ సి. నారాయణరెడ్డి లాంటి ప్రముఖుల ప్రశంసలు అందుకుని కవయిత్రి, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొంద రు హనుమకొండ పట్టణానికి చెందిన అనిశెట్టి రజిత. మనసు తలపులకు తోరణాలు తన సాహితీ జ్ఞాపకాలని అనిశెట్టి రజిత చెబుతుంటారు. ఉద్యమాలు, సాహిత్య రంగంతో తన ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లఉన్నాయని చెబుతున్న ఆమెకు ఉమ్మడి రాష్ట్రంలో 1975లో వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర సాంస్కృతిక రజతోత్సవాల్లో సుప్రసిద్ధ కవులతో నిర్వహించిన కవిసమ్మేళనంలో స్థానం దక్కింది. ప్రముఖ కవులు డాక్టర్ దాశరథి, డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, నాయిని కృష్ణకు మారి, కొలకలూరి ఇనాక్ లాంటి వారి సమక్షంలో కవిత వినిపించారు. ఆ సమయంలో ప్రపంచ మంతా పైసా మయం అనే కవితను వినిపించిన రజితను కవులంతా ఎంతగానో ప్రశంసించి ఆమె తలమీద చెయ్యి పెట్టి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అది తనకు అపూర్వ జ్ఞాపకమని, తన సాహితీ చరిత్రలో మరువలేని సంఘటన అని అనిశెట్టి రజిత పేర్కొన్నారు. హనుమకొండలో మరోసారి కేతవరపు రామకోట శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే.. కవిత ప్రమాణికంగా ఉంటేనే వచ్చి వినిపించాలని రామకోటశాస్త్రి ఆదేశించగా.. భయపడుతూనే ఆమె తన కవితను వినిపించారట. ఆ తర్వాత రామకోటశాస్త్రి ఆమెను ప్రశంసించారట. 1976-77 సంవత్సరం లో తన కవితా సంపుటి కి అచ్చు వేయా లని దాని ప్రతి ప్రజా కవి కాళోజీకి చూపించగా.. కవితలు బాగానే ఉన్నాయి. కానీ లకోటగా ఉన్నాయని, ఇంత చిన్న వయసులో పుస్తకం ఎందుకు ప్రచురించడం అని సంశయించడంతో రెండు దశాబ్దాల అనంతరం 1997లో నెనొక నల్లమబ్బునవుతా అన్న తొలి ప్రచూరణతో సాహితీ ప్రపంచానికి పరిచమైనట్టు రజిత వివరించారు. కాళోజీనే ఆ సభకు అతిథిగా పిలుచుకున్నానని, ఆకాశమెత్తుకు ఎదిగిన కాళన్న తన కవితలను ప్రశంసించడం ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె చెప్పారు. దాశరథి రంగాచార్య అక్షర షరతులు నందించే మహా రచయిత ప్రశంసలు కూడా అనేక సందర్భాల్లో అందుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రమంతా వందలాది సాహిత్య వేదికలపై పరిచయాలు, స్నేహం, అనుబంధాలు అనేకం. ఇప్పటి వరకు 13 గ్రంథాలు ముద్రించాను. రుద్రమ వేదిక ప్రచురణల వ్యవస్థాపక సభ్యురాలిగా గత దశాబ్దంన్నర కాలంగా మూడోసారి ఆమె జాతీయ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు.



సామాజికం, సాహిత్యం సమాంత రంగా 20కి పైగా సంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు 38 పురస్కారాలు అందుకున్నారు రజిత. కవి అయిన రచయిత అయిన కళాకారులైనా సాహిత్య, సాంస్కృతిక సైనిక ల్లా క్రమశిక్షణతో ఉండాలని, అధ్యయనంతో రచనలు సాధన చేయాలని, వేదికలు సన్మానాలకు లొంగకూడదని ఆమె యువతకు పిలుపునిస్తున్నారు. సమాజం పట్ల పీడిత జన సమూహాల పట్ల ప్రేమతో సాను భూతి చూపేలా కవిత్వంతో కారుణ్యం కలిగి ఉండేలా రచనలు చేయాలన్నారు. నైతిక విలువలు మానవీయత కవి గమ్యం కావా లన్నారు. మానవ సంబంధాల విస్తరణ సామాజిక శాంతి, కవితా లోకం లక్ష్యం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.


కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను పంపిస్తున్న సీఐ సత్య నారాయణరెడ్డి

రేవంత్‌రెడ్డి.. ఇచ్చిన మాట మరువొద్దు

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల నినాదాలు
- కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మరువొద్దని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికెల శ్రీధర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రం నుంచి కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా దొనికెల శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేతిలోనే విద్యాశాఖ ఉన్నదని, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వెంటనే వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అసోసియేషన్ ఆల్ వింగ్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 29 రోజులుగా ఏకశిలా పార్కు వద్ద దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ కాళోజీ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సుబేదారీ సీఐ పి.సత్యానారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది కాళోజీ జంక్షన్ వద్దకు చేరుకుని కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించి వేశారు. కాళోజీ జంక్షన్‌లో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో కొద్దిసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు షఫీ, కుమార్, రమేష్, మనోజ, సరిత, రుద్రారపు రాజు, తండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు మునిసిపాలిటీకి
కేబినెట్ ఆమోదం

పాత బిల్లును సవరిస్తూ.. జాకారం విలీనం

- నాలుగు గ్రామ పంచాయతీలతో విస్తరణ
- బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు



ములుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి, జాకారం గ్రామాలను విలీనం చేయనున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి 2022సెప్టెంబరు 12న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీ చట్టసవరణ బిల్లులో ములుగును మునిసిపాలిటీగా ఏర్పాటుచేస్తూ తీర్మానించింది. ములుగు గ్రామపంచాయతీతోపాటు బండారుపల్లి, జీవంతరావుపల్లిని విలీనం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే బిల్లు సుదీర్ఘకాలం రాజ్‌భవన్‌లోనే నిలిచిపోయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ములుగు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ధనసరి అనసూయ సీతక్కకు మంత్రివర్గంలో కీలక పదవి రావడంతో ప్రజల్లో ఆశలు కలిగాయి. ఆమె చొరవతో గతేడాది జూలై 6న గవర్నర్ మునిసిపాలిటీ బిల్లుకు ఆమోదం తెలిపారు. ఆవెంటనే రాష్ట్రపతి పరిశీలనకు కూడా పంపించారు. అయితే ములుగు మునిసిపాలిటీ పరిధిలోకి జాకారం గ్రామాన్ని తీసుకురావాలనే అంశం తెరపైకి వచ్చింది. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్ జాకారంలోనే ఉండటం, భవిష్యత్ అవసరాలకు ఇక్కడికి సమీపంలో ప్రభుత్వ భూములు ఉండటంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క జాకారంతో కూడిన మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రి సూచనతో జిల్లా కలెక్టర్ గ్రామ సభ ఏర్పాటు చేయించారు. ప్రజలు అంగీకారం తెలపడంతో తీర్మానం నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ప్రస్తుతం జనాభా ప్రకారం ములుగు, బండారుపల్లి, జాకారం, జీవంతరావుపల్లి కలుపుకొని 25వేల మందికిపైగా జనాభా ఉంటుందని అంచనా. ఓవక్క స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర సర్కారు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో కేబినెట్ ఆమోదం పొందిన మునిసిపాలిటీ బిల్లును వెంటవెంటనే గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనకు పంపించి సాధ్యమైనంత త్వరగా ఆమోదింపజేయాలని మంత్రి సీతక్క కృషి చేస్తున్నారు.

అంబరాన్నంటిన సంబురాలు

ములుగు మునిసిపాలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి ములుగులో సంబరాలు చేసుకున్నారు. జాతీయ రహదారిపై బానాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ ఏర్పాటుతో ములుగు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, పట్టణాధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్ది రాజు, నల్లెల భరత్‌కుమార్, యాసం రవికుమార్, ఇమ్మడి రాజుయాదవ్, ఎల్లావుల అశోక్‌యాదవ్, లావుడ్య రమేష్, మట్టెవాడ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


ములుగు పట్టణం

కర్షకుల్లో హర్షాతిరేకం

- కిసాన్ సమ్మాన్ నిధి పెంపుతో ఆనందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది లబ్ధిదారులు
- ఆంక్షలతో అందరికీ కేంద్ర ప్రభుత్వ పథకం



హనుమకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాన్ని రూ.6000 నుంచి రూ.10000 వేలకు పెంచుతున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పెంపు వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నదాతలకు అదనంగా రూ.162 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పొందుతున్నారు. కిసాన్ నిధి మొత్తాన్ని పెంచుతూ 2025-26 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన చేయబోతున్నారు. రైతులను ఆరికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాల్లో చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సహాలు రేపింది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసాన్ సమ్మాన్ యోజన నిధి కింద 4,07,246 మంది రైతులు ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. హనుమకొండ జిల్లాలో 60,100 మంది, వరంగల్ జిల్లాలో 62,1213, జనగామ జిల్లాలో 73,420, మహబూబాబాద్ జిల్లాలో 95,321, ములుగు జిల్లాలో 58,761, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 57,523 మంది రైతులు సమ్మాన్ నిధి పొందుతున్నారు. కాగా, వివిధ కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో 9,253 మంది రైతులకు ఈ పథకం కింద లబ్ధి నిలిచిపోయింది. వీరిలో హనుమకొండ జిల్లాలో 1,520, వరంగల్‌లో 1,652, జనగామలో 17,358, మహబూబాబాద్‌లో 1,842, ములుగులో 1,376, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,128 మంది రైతులు వీరిలో ఉన్నారు. వీరుకాకుండా కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందినవారు, ధరణిలో భూముల వివరాలు సరిగా నమోదు కానివారు, తప్పులు దొర్లిన వారు, ఇతరత్రా కారణాల ఫలితంగానూ మరో 1,19,534 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధికి దూరంగా ఉన్నారు.

కొత్తగా పట్టాలు

నాలుగేళ్లుగా ఇప్పటి వరకు 18 విడతలుగా ఏటా రూ.6వేలను మూడు దఫాలుగా జమ చేసింది. 2019 నుంచి కేంద్రం నిబంధనలను సడలించకపోవడంతో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సాయం అందడం లేదు. 2019 ఫిబ్రవరి వరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులను మినహాయించి మిగిలిన పట్టాదారు రైతులకు కిసాన్ సమ్మాన్ జాబితాలో చేర్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరి వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికే వర్తింపచేస్తున్నారు. పట్టాదారు మరణిస్తే ఆ భూమిని విరాసత్ చేసుకున్న వారికి తిరిగి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తమ అవసరాల రిత్యా లబ్ధిదారులు భూములను విక్రయిస్తే ఆ భూములు కొనుగోలు చేసిన వారికి వర్తింపచేయకపోవడంతో ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది.

ధరణి కారణంగా..

2015లో రాష్ట్ర ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టిన తర్వాత 2018 నుంచి హైసెక్యూరిటీ గల పాస్‌బుక్‌లను రైతులకు అందజేస్తోంది.



2019 ఫిబ్రవరి నాటికి చాలామందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదు. ధరణి పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన తర్వాత అప్పటి భూముల వివరాలు అప్‌డేట్ కాలేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో కొన్ని తప్పులు దొర్లాయి. వాటిని సరిద్దిద్దే నాటికి ప్రభుత్వానికి రెండేళ్లు పట్టింది.

ఈ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మందికి 2019 ఫిబ్రవరి తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదు. రాష్ట్రంలో త్వరలో భూ భారతి అమలులోకి వస్తున్నందువల్ల దీని ద్వారా అయిన రైతుల సమస్యలను పరిష్కరించి కిసాన్ లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని రైతులు కోరుతున్నారు. రైతుబంధు పథకంలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఏటా అవకాశం కల్పిస్తున్నారు. కానీ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఆ అవకాశం లేదు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా నింపిన రైతులు సైతం తిరస్కరణకు గురయ్యారు.

బ్యాంకు ఖాతాలు మూతపడ్డ రైతులు, బ్యాంకు ఖాతాలు చెల్లని వారు కూడా ఈ పథకానికి దూరమయ్యారు. 18 ఏళ్ల వయసులోపు రైతులకు ఇది వర్తించడం లేదు. దరఖాస్తు పరిశీలన సమయంలో రైతుల రికార్డులను బ్యాంకు లేదా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) తిరస్కరించడంవల్ల కూడా కొందరు రైతులు సమ్మాన్ నిధిని పొందలేకపోతున్నారు. కిసాన్ సమ్మాన్ నిధిలో చేరాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. అవగాహన లేక చాలా మంది రైతులు చేసుకోవడం లేదు. వీరి సాయం పొందలేపోతున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో కూడా డబ్బులు రావడం లేదు. ఆదాయం పన్ను చెల్లించే రైతులను ఈ పథకం నుంచి తొలగించారు. రేషన్ కార్డుల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే వర్తింపచేస్తున్నారు. రూ.10వేల కంటే ఎక్కువ పించన్ తీసుకున్నవారిని పథకం పరిధి నుంచి తొలగించారు. తర్వాత విడతల్లో అయినా కిసాన్ సమ్మాన్ నిధి అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అర్హులైన రైతులందరికీ డబ్బులు ఖాతాల్లో పడేలా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సడలించాలని, కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

మరి ఆంక్షల మాటేమిటి ?

సమ్మాన్ నిధి అమలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల సంగతేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా అంత సులువుగా ఈ పథకం లేదు. అర్హులైన అన్నదాతలకు మాత్రమే పెట్టుబడి సాయం అందాలన్న లక్ష్యంతో కేంద్రం సమ్మాన్ నిధి వర్తింపుపై అనేక ఆంక్షలు విధించింది. కేవైసీ తప్పని సరి చేసుకోవాలన్న షరతు పెట్టింది. దీనితో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతులు ఇప్పటికీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిధిలోకి రాలేకపోతున్నారు. సకాలంలో కేవైసీ చేసుకోలేని వేలాది మంది రైతులు డబ్బులు విడుదలైన బ్యాంకుల నుంచి పొందలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పీఎం కిసాన్ నిధిని నోచుకోలేని రైతులు సుమారు లక్ష మంది వరకు ఉంటారని అంచనా.

నిబంధనలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకంలోని నిబంధనలు సడలించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలా మంది రైతులు ప్రయోజనం పొందలేకపోతున్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల కొంత మంది రైతులు లబ్ధిపొందలేకపోతుండగా, నిబంధ నల సడలింపు లేకపోవడం వల్ల మరి కొంత మంది ఈ పథకం పరిధిలోకి రాలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసా న్ సమ్మాన్ యోజన నిధి ద్వారా సుమారు 4,07,246 మంది ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ పథకం అమలులోకి వచ్చిన మొదట్లో వీరి సంఖ్య 4,16,499 ఉండగా, ఆ తర్వాత కాలంలో వీరి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. వివిధ కారణాల వల్ల 9,253 మంది రైతులవి పెండింగ్‌లో ఉన్నాయి.

ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అత్యంత పారద ర్శకంగా నిర్వహించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ దివా కర అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేం దర్‌జీ, సంపత్ రావుతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు మొబైల్‌యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించా లన్నారు. ఇప్పటివరకు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇళ్ల సర్వేలో వెనుకంజలో ఉన్న మండలాల ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసుకుని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు ప్రభుత్వ మార్గ దర్శకాలను అనుసరించి తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. అంతకుముందు ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలుతీరును క్లస్టర్లవారీగా పనిదినాలు, చేపడుతున్న పనులు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు రుణాలను ఈనెల 31వరకు పంపిణీ చేయాలన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో వెంకటేష్, ఎల్‌డీఎం, ఏపీడీ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, సీసీలు, ఎస్‌బీఎం, టీఏలు పాల్గొన్నారు.

రోబోటిక్స్ శిక్షణను సందర్శించిన కలెక్టర్

విద్యారంగంలో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో సోహం అకాడమీ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలోని పది పాఠశాలల్లో నిర్వహిం చిన రోబోటిక్స్ శిక్షణను శనివారం కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈసందర్భంగా ఆయన ములుగు మండలంలోని బండారుపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోహం అకాడమీ రోబోటిక్స్ విద్య ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరచడం అభినందనీయమని అన్నారు. ఈశిక్షణ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తు, అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, రోబోటిక్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో పాణిని, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, ఉపాధ్యాయులు, సోహం అకాడమీ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

చిట్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించారు. మండలం లోని నవాబుపే టకు చెందిన సన్నీ ఆస్పత్రిలో చికిత్సపొంది ఇంటికి చేరుకోగా వారి ఇంటికి వెల్లి మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన తిప్పాని అశోక్, చెక్క సాంబ య్య కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయం అంధజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పిట్ట సురేష్‌బాబు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సాద రాజు, అహ్మద్‌పాషా, నరేష్, శ్రీను, రఫీ, రాములు తదితరులు ఉన్నారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా

భూపాలపల్లిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మునిసిపల్ కార్మి కులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాల యం ఎదుట విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. తమ సర్వీసులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 21వేలు వేతనం అమలు చేశారని, కేటగిరీల వారీగా వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. అదే తర హాలో తెలంగాణలో కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, 8గంటల పనిదినం అమలు చేయాలని అన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారి బాబు, నర్సయ్య, సమ్మయ్య, సాయన్న, పుల్ల అశోక్, మహేష్, కార్తీక్, రవి, సురేష్, శ్రీనివాస్, మంతెన రాధాకృష్ణ, దేవేం దర్, రాజుకుమార్, రామకృష్ణ, శ్రీను, రాజు, మంజూల, నిర్మల, రాజేశ్వరి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కాటారం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో ట్రస్మా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి క్రీడోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. భూపాలపల్లి ఆర్డీవో సమ్మానీతో కలిసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు ట్రస్మా ఏరియా కమిటీ ఆధ్వర్యంలో క్రీడాజ్యోతితో మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కల్గుతుందని, విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ఏరియా కమిటీ అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు జనగామ కార్తీక్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై అభినవ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, పాఠశాలల బాధ్యులు కరుణాకర్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడ్, పృథ్వీధర్‌రావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : ఆర్టీవో

రోడ్డు భద్రతా ప్రమాణాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని భూపాలపల్లి ఆర్టీవో సమ్మానీ అన్నారు. మండలకేంద్రంలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్టీవో హాజరయ్యారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సుందర్, కాటారం ఎస్సై అభినవ్, పలువురు నాయకులు, ప్రజలు, విద్యార్థులు ఉన్నారు.

ఎడ్లబండిని బైక్ ఢీకొని ఒకరి మృతి

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎడ్లబండిని బైక్ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలం దూదేకుపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లబుద్దారం గ్రామా నికి చెందిన నూనేటి వెంకన్న (48) వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహ నంపై దూదేకుపల్లికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఎడ్లబండి రావడంతో అది గమనించక ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చి భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

రేగొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఎస్సై సందీప్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై సందీప్‌కుమార్ మాట్లాడుతూ వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని అన్నారు. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీ ఎస్సై దివ్య, ఏస్సై రవిందర్‌రెడ్డి, హెచ్‌సీ శ్రీశైలం, పీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

కాటారం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాటారం పోలీస్ స్టేషన్‌లో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రామగుండం కమిషనరేట్ పరిధిలోకి బదిలీ అయిన ఏఎస్సై మొగిలి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం, పీసీ శ్రీనివాస్‌కు శనివారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు సన్మానం జరిగింది. సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ ఏఎస్సై, హెచ్‌సీ, పీసీలను పూలమాలలు, శాలువా తో సన్మానించి బహుమతులందించి ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో సహకరించిన పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది, ప్రజలకు పోలీస్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తల్లి, భర్త మందలించడంతో మహిళ ఆత్మహత్య

మహాముత్తారం, జరనవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని తల్లి, భర్త మందలించడంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొనంపేట గ్రామానికి చెందిన చిడెం భాగ్య (39) మద్యానికి బానిసైంది. దీంతో తల్లి, భర్త ఆమెను మందలించారు. ఈ క్రమంలోభాగ్య మనస్తాపం చెంది ఈనెల 2న పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో ఆమె శనివారం మృతి చెందింది. మృతురాలి తల్లి మడప లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త శ్రీనుతోపాటు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చేపల విక్రయ వాహనం అందజేత



లబ్ధిదారుకు వాహనాన్ని అందజేస్తున్న భూపాలపల్లి కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సంచార చేపల వాహనాన్ని లబ్ధిదారుకు కలెక్టర్ రాహుల్‌శర్మ అందజేశారు. కలెక్టరేట్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారు చిగిరి మీనకు రూ. 10లక్షల సంచార చేపల విక్రయ వాహనాన్ని కలెక్టర్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా చేపల వ్యాపారం, చేపల ఉత్పత్తులు, చేపల ఆహారం వ్యాపారం చేసుకోవడానికి లబ్ధిదారుకు వాహ౦ం అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి అవినాష్,డిఆర్డీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ-3 ప్రమాదంపై విచారణ

కాకతీయఖని, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3లో శుక్రవారం జరిగిన ఓల్వా ట్రక్ ప్రమా దంపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికా రులు శనివారం విచారణ చేపట్టారు. ప్రమాదా నికి కారణాలను డీడీఎంఎస్‌లు కమలేష్ కుమార్‌వర్మ (మైనింగ్), దిలీప్ కుమార్ (మెకానికల్) గని అధికారులను అడిగి తెలుసు కున్నారు. కంపెనీ ప్రొసీజర్స్, ఎస్‌వోపీ, సీవోపీ, వీటీసీలు చేస్తున్నారా..లేదా.. డ్రైవర్లకు లైసెన్స్‌లు ఉన్నాయా? తదితర అంశాలను పరిశీలించినట్లు సమాచారం.

బాధితుడిని ఆదుకోవాలి

కాకతీయఖని, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3 క్వారీలో గాయపడిన వోల్వా ట్రక్ డ్రైవర్ అన్వర్‌పాషాను కాంట్రాక్టర్, సింగరేణి యాజ మాన్యం అన్నివిధాలా ఆదుకోవాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ భూపా లపల్లి ఏరియా ఇన్‌చార్జి కోలా నాగేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్వర్‌పాషా డ్రైవర్ వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, శుక్రవారం జరిగిన ప్రమాదంలో అతడు కాలిని పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. అతడు కోలుకునేంత వరకు ఖర్చుల న్నీ భరించాలని కోరారు. రూ. 50 లక్షల నష్ట పరిహారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు.

టీఎస్ పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



మొగుళ్లపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మొగుళ్లపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం టీఎస్ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ప్రధాన కార్యదర్శి గడ్డం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన క్యాలెండర్‌ను ఎంఈవో లింగాల కుమారస్వామి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయపాల్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగం అభివృద్ధి కోసం పీఆర్టీయూ పాటుపడుతుందని అన్నారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తిం పజేయడం, పెండింగ్ డీఏల మంజూరు, మెరుగైన పీఆర్సీ, తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈకార్య క్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి, సభ్యులు కుమా రస్వామి, రవీందర్, చంద్రయ్య, ఉపాధ్యాయులు రాజయ్య, నాగరాజు, రాజు, సురేందర్, రాము, విజయభాస్కర్, భాగ్య, పద్మ, కళ్యాణి, శ్రీకళ, తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ 2025 నూతన క్యాలెండ ర్‌ను ఎంఈవో కొయ్యడ మల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం టేబుల్ క్యాలెండర్‌ను ఏటూరునాగారం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సాంబశివ రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెరుకుల ధర్మయ్య, ములుగు జిల్లా కార్యదర్శి కోడి వెంకట్, మండల అధ్యక్షుడు ఎస్కే. నయీం, ప్రధాన కార్యదర్శి ఎస్. రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
- మేడారం (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాయం మానేశ్వరరావు అన్నారు. శనివారం తాడ్వా యి మండలం కాటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు బాణాల సుధాకర్ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్రునాయక్, సమ్మయ్య, సామ్సన్, అక్బర్, జీవన్‌లాల్, వెంకటేష్, పాపారావు, రాజేష్, జైపాల్, విజయ, శ్రీదేవి, మోహన్ పాల్గొన్నారు.

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను శనివారం ఎంఈవో జీవీ. సత్యనా రాయణ మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఆవిష్కరించారు. ఈసం దర్భంగా జరిగిన సమావేశంలో ఏటీఏ ఆర్గనైజింగ్ కార్యదర్శి పసుల సూర్యనారాయణ మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యుల ర్‌చేసి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్‌రావు, తోలెం చిరంజీవి, కృష్ణారావు, భుజంగరావు, రమాదేవి, ఎర్ర లక్ష్మయ్య, సురేష్, వరలక్ష్మి, కవిత, పుష్పవతి, కామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సునీతకు కృత్రిమ కాలు



సునీతకు కృత్రిమ కాలు ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటాపురం, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వీఆర్కేపురం గ్రామానికి చెందిన కర్ర సునీత కొంత కాలం క్రితం పామునూరు గుట్టల సమీ పంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ఎడమ కాలు కోల్పోయింది. శనివారం సునీతకు భారతీయ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్టు, వెంకటాపురం పోలీసుల సహకారంతో కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సు నీతకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించడంతోపాటు భద్రాచ లం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ సునీతకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అందజేలా కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, నాయకులు మద్దుకూరి ప్రసాద్, రవి, రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మేడారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని కన్నెపల్లి, ఊరట్టం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించా లని గ్రామస్థులు చర్ప రవీందర్, నేతాజీ, గొంది సరిత కోరారు. బస్సు ప్రయాణం చేయాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని తెలిపారు. వృద్ధులు, చిన్నారులు నడవలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వచ్చే సరికి బస్సు వెళ్లిపో తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఊరట్టంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉందని బస్సు సర్వీసు లేకపోవ డంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పడం లేదన్నారు. కన్నెపల్లి గ్రామంలో సారలమ్మ పూజా మందిరం ఉండడంతో అక్కడకు నిత్యం భక్తులు వస్తుంటారన్నారు. వెంటనే ఈ రెండు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

(5వ పేజీ తరువాయి)

తహసీల్దార్ హేమ, మాజీ జడ్పీటీ ఎలు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, కాం గ్రెస్ దొడ్డి కిష్టయ్య, అల్లకొండ కుమార్, సర్వ శరత్, అల్లం రాజు, పిట్టల సాంబ య్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు

రేగొండ (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల కు మౌలిక సౌకర్యాలు కల్పించ డమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం

వైద్యా రంగానికి పెద్ద పీట

కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. మండల కేంద్రం లోని కేజీబీవీ పాఠశాలలో ఆయనతో పాటు కలెక్టర్ రాహుల్ శర్మ దుప్పట్ల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత రేవంత్ సర్కారుదే నన్నారు. కేజీబీవీ విద్యార్థినులు బాగా చుదువుకొని తల్లితండ్రుల ఆశలను నెరవేర్చాలని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టరు విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి శైలజ, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట మండలం చల్వాయిలో ఈనెల 7న నిర్వహించే మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర నిరుద్యోగ యువతీ, యువకులకు సూచించారు. ఈమేరకు శనివారం తన చాంబర్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్‌మేళాలో 50 ప్రైవేట్ కంపెనీలు పాల్గొనున్నాయని, యువతీ, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డీపీఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు సభను విజయవంతం చేయాలి

వాజేడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దళిత ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని రెండో విడత దళిత బంధు సంఘ రాష్ట్ర సలహాదారుడు దర్శనాల సంజీవ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 6న జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని, ప్రతి లబ్ధిదారుడూ హాజరై సభను విజయంతం చేయాలని కోరారు. అనేక ఉద్యమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రెండో విడత దళిత బంధు నిధులను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు దేపాక శ్రీరామ్, వాజేడు మండల అధ్యక్షుడు లేగల రవి, నాయకులు కర్ని ఓంకార్, భగుతు మల్లయ్య, చెన్నూరి వినోద్, కీసరి రాజు, చిట్యాల రాకేష్, జనగం లక్ష్మణరావు, సోమిడి రవి, గుగ్గిళ్ల భూషణం, తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో విద్యార్థుల సందడి

వెంకటాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేటలో గల రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థులు సందడి చేశారు. హనుమ కొండ జిల్లా హసన్‌పర్తి పాఠశాలకు చెందిన 250మంది విద్యా ర్థులు, ఉపాధ్యాయులు ఆలయానికి చేరుకుని రామలింగేశ్వరస్వామిని దర్శిం చుకున్నారు. అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ శిల్పకళా విశిష్టతను, ఆలయ చరిత్రను గురించి గైడ్‌లను అడిగి తెలుసుకు న్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు.

వర్గీకరణ సదస్సును విజయవంతం చేయండి: ఎమ్మార్పీఎస్

ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల 8న జరిగే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలో చందా మహేష్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ జడ్జిమెంట్ ఇచ్చినా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా యని అన్నారు. ఆదివాసీ, ప్రజాసంఘాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాటం చేయాలన్నారు. 8న జరిగే సదస్సుకు జిల్లాలోని ఆదివాసీలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్, ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ జిల్లా ఇన్‌చార్జి గుర్రం రామన్న, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇరుగు పైడి, నెమలి నర్సయ్య, నాయకులు ఇండ్ల సమ్మయ్య, ధనుంజయ, వజ్జ రాజు, ముంజాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నాణ్యమైన సేవలందించాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు నాణ్యమైన సేవలందించాలని జిల్లా సంక్షేమ అధికారి కూచన శిరీష సూచించారు. శనివారం జిల్లా సంక్షేమశాఖ కార్యాల యంలో సూపర్‌వైజర్లు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా లబ్ధిదారులకు ఐసీడీ ఎస్ ద్వారా సమగ్రమైన సేవలందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రా లకు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతీరోజు హాజరయ్యేలా చూడా లని, వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. లబ్ధిదా రులకు అందించే సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ముమ్మరంగా యాసంగి వరినాట్లు

వాజేడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో యాసంగి వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే వానాకాలం పంటకు సంబంధించి వరి కోతలు, ధాన్యం విక్రయాలు పూర్తి కాగా యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండల కేంద్రంతో పాటు జగన్నాధపురం, గుమ్మడిదొడ్డి, పేరూరు, ధర్మవరం, ఏడ్జర్లపల్లి తదితర గ్రామాల్లో యాసంగి సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. పొలాలను ఇప్పటికే దుక్కులు, దమ్ములు చేసి వరినాట్లు మొదలుపెట్టారు. మండల వ్యాప్తంగా యాసంగిలో సుమారు 500 ఎకరాలకు పైగా వరిని సాగు చేయనున్నట్లు సమాచారం. కూలీల కొరత ఉండటంతో ఇతర మండలాల నుంచి రైతులు కూలీలను తెప్పించి వరినాట్లను వేయిస్తున్నారు. కొంత మంది రైతులు ఒప్పంద వ్యవసాయాన్ని సైతం సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తుండటంతో సన్నరకం వరిపంటను సైతం రైతులు సాగు చేస్తున్నారు. బోర్లు, చెరువులు కింద పంటలు పండించే రైతులు యాసంగి వరిపంటను ముమ్మరంగా సాగు చేస్తున్నారు.

ఆదివాసీ హక్కులపై అవగాహన అవసరం

వెంకటాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ చట్టాలు, హక్కులపై యువత అవగాహన పెంచుకోవాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆదివాసీ చైతన్యయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ ఆదివాసీల్లో హక్కులు, చట్టాలపై చైతన్యం తీసుకురావడం కోసం ఈ యాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం మునేశ్వర్‌రావు, తాటి లక్ష్మణ్, పవన్‌కుమార్, దిలీప్, పూనెం నాగరాజు, పొడెం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


తూట్లు పొడుస్తున్న నూతన రెవెన్యూ చట్టం

నూతన రెవెన్యూ చట్టంతో ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. శనివారం మండలంలోని ఆలుబాకలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఆదివాసీల స్థితిగతులు ఇబ్బందికరంగా ఉన్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల చట్టాలను హరించడం కోసమే పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీలో నూతన రెవెన్యూ చట్టాలను రద్దుచే యాలని, ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు అందిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు మీడియం అర్జున్, కన్నయ్య, మడకం ప్రసాద్, నాగేశ్వర్‌రావు, సమ్మయ్య పాల్గొన్నారు.

హేమాచలుడి హుండీ ఆదాయం రూ. 7.37 లక్షలు

మంగపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలోని ఎనిమి ది హుండీలను అధికారులు లెక్కించారు. గత ఆగష్టు 30 నుంచి ఈనెల 3 వరకు హుండీలలో భక్తులు వేసిన కానుకల ద్వారా రూ. 70,37,539 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో శ్రవణం సత్యనారాయణ తెలిపారు. ఇందులో యూఎస్‌ఏ డాలర్లు 33 ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకులు కవిత, అర్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ముక్క మల్ల రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారా చార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, వెంకట నారాయణశర్మ, అనిపెద్ది మురళికృష్ణ శర్మ, అర్చక, ఉద్యోగులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాస్

మేడారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక శనివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా పులుసం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పాడ్యా గాంగునాయక్, గౌరవ అధ్యక్షుడిగా మడే నాగేశ్వరావు, సంయుక్త కార్యదర్శులుగా డి. రేవతి, డి. రాములు, కోశాధికారిగా వేణుగోపాల్, ముఖ్య సలహాదారుడిగా ఎ. చేరాలు, కార్యవర్గ సభ్యులుగా కే. రవీందర్‌రెడ్డి, బి. సాయిబాబా, డి. సారయ్య, ఈ. రాజరత్నంలను ఎన్నుకున్నారు. ఎన్నిక పరిశీలకులుగా ఈసం సురేందర్‌రావు, ఎం. నాగేశ్వరావు, ఈ. సారయ్య లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.